క్లుప్తంగా

'ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో అన్యాయం'

నల్లగొండ టౌన్: రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టికోల దీపేందర్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పరిశీలించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ప్రక్రియపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎలిజాల వెంకటేశ్వర్లు, బోల్ల నాగరాజు, వనం వెంకటేశ్వర్లు, మహేందర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు పవన్‌ను సన్మానిస్తున్న సీఐ డానియల్

రామగిరి(నల్లగొండ): పట్టణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ది నల్లగొండ మిర్యాలగూడ రోడ్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పున్న పవన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ డానియల్ పాల్గొని అధ్యక్షుడు పున్న పవన్‌కుమార్‌ను సన్మానించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఇబ్రహీం అలీ, జూలకంటి సైదిరెడ్డి, నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జుకూరి రమేష్, కౌన్సిలర్ బోగరి ఆనంద్‌కుమార్, కార్యవర్గ సభ్యులు రామకృష్ణారెడ్డి, ఆచారి, సింగం సతీష్, చెవుగోని సైదులుగౌడ్, పందిరి శంకర్, సత్యనారాయణ, ఎండీ. సమీ, అల్తాస్ సైదులు, కంభంపాటి జానయ్య, తండు జానయ్య, శ్యాంసుందర్, పున్న వెంకన్న, రిజ్వాన్, ఏకాంబరం, మధుసూదన్‌రెడ్డి, కల్లు శ్రీనివాస్ రెడ్డి, మేడిశెట్టి యాదయ్య, కిన్నెర అంజి పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలానికి చెందిన పలువురు టీఎస్ పీఆర్టీయూ ప్రతినిధులకు సంఘం జిల్లా కార్యవర్గంలో చోటు లభించింది. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా కనుకుంట్ల వెంకట్‌రెడ్డి, అక్కెనపల్లి అంజనేయులు, ఉపాధ్యక్షులుగా కన్నె శివయ్య, తన్నీరు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులుగా తీగల డేవిడ్, రాజారమేష్, మహిళా కార్యదర్శిగా కుంట్ల సబిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆదివారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గంలో చోటు దక్కించుకున్న మండల బాధ్యులను పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో అభినందించారు.

నేడు బీఆర్ఎస్ ధర్నా

చిట్యాల: రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ చిట్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ చిట్యాల మున్సిపాలిటీ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్ తెలిపారు. ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొంటారని పేర్కొన్నారు. రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రాములు

నకిరేకల్ : పట్టణంలోని వాసవి కళాశాలలో లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రీ స్టడీ సెంటర్‌కు స్థానికుడు సింగరి రాములు ఆదివారం స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి బ్రహ్మదేవర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచాలి

మర్రిగూడ : ఉపాధి హామీ కూలీలకు రోజువారి కూలీ రూ.700 వరకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగూరి నరసింహ ప్రభుత్వాన్ని డి మా డ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో కోరె సత్తయ్య అ ధ్యక్షతన ఏర్పాటు చేసిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.

ఆర్టీఐ రక్షక్ జిల్లా ప్రెసిడెంట్‌గా మధు

చిట్యాల: పట్టణానికి చెందిన కునూరు మధు ఆర్టీఐ రక్షక్ జిల్లా ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సతీష్ ఆదివారం మధుకు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కల్లెం చంద్రశేఖర్, ఉపేందర్ పాల్గొన్నారు.

10న బతుకమ్మ సంబరాలు

నల్లగొండ టౌన్: చర్లపల్లి గ్రామంలో ఈ నెల 10న గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకు ఆంజనేయస్వామి గుడి వద్ద బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు, మాజీ సర్పంచ్ మేడి శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు.

సర్వీసు రోడ్ల నిర్మాణానికి మోక్షం



ఇనుపాముల వద్ద సర్వీసు రోడ్డు పనులు చేస్తున్న ప్రొక్లెయిన్



చెట్లను తొలగింపజేయిస్తున్న అధికారులు

- నేషనల్ హైవేపై ఇనుపాముల వద్ద పనులు ప్రారంభం
- రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు, లైటింగ్ సిస్టం
- తీరనున్న వాహనదారుల కష్టాలు

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల గ్రామంలో 65 నంబర్ జాతీయ రహదారి వెంట సర్వీసు రోడ్ల నిర్మాణ పనులకు మోక్షం లభించింది. బస్‌స్టేజీ వద్ద నిర్మించిన అండర్ పాస్ వంతెనకు విజయవాడ వైపు వంద మీటర్ల దూరం నుంచి ప్రారంభమై.. మల్లన్న గుట్ట వరకు ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మాణ పనులు జరగనున్నాయి. హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిపై తరుచూ ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌ల వద్ద ఎన్‌హెచ్‌ఏఐ నివారణ చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కేతేపల్లి మండలంలో బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన ఒక్క ఇనుపాముల గ్రామంలో మాత్రమే సర్వీసు రోడ్ల నిర్మాణానికి ఆమోదం లభించింది. సర్వీసు రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిసింది. ఈటెండర్‌ను హరియాణకు చెందిన ఆర్‌కేసీ సంస్థ దక్కించుకుంది. రెండు నెలల క్రితమే టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ కాంట్రాక్టు సంస్థ ఇటీవలే పనులు ప్రారంభించింది.

1.2 కిలోమీటర్ల మేర నిర్మాణం

జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించిన సమయంలో ఇనుపాముల గ్రామంలో బస్‌స్టేజీకి దాదాపు కిలోమీటర్ దూరంలో మల్లన్నగుట్ట వద్ద యూటర్న్ జంక్షన్ ఏర్పాటు చేశారు. అయితే బస్‌స్టేజీ వద్ద హైవేపై అండర్‌పాస్ వంతెన నిర్మించిన సమయంలో విజయవాడ వైపు వెళ్లే మార్గంలో ఇరువైపులా కేవలం వంద మీటర్ల వరకు మాత్రమే సర్వీసు రోడ్డు నిర్మించారు. జంక్షన్ వరకు సర్వీసు రోడ్లు లేకపోవడంతో గ్రామం నుంచి పశువులు, ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వీసు రోడ్డు లేకపోవడంతో గ్రామం నుంచి అర కిలోమీటర్ దూరంలో మల్లన్నగుట్ట వద్ద ఉన్న వడ్డెర కాలనీవాసులు ఇనుపాముల గ్రామంలోకి రాకపోకలు కొనసాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

డ్రెయినేజీలు, లైటింగ్ సిస్టం..

సర్వీస్ రోడ్డు లేకపోవడంతో వాహనదారులు ఒక్కోసారి హైవేపై రాంగ్‌రూట్లో వస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం చేపడుతున్న సర్వీసు రోడ్లను విజయవాడ వైపు వెళ్లే మార్గంలో కుడి వైపు మల్లన్నగుట్ట వరకు, ఎడమ వైపు మల్లన్న గుట్ట ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ వరకు నిర్మించనున్నారు. 18 ఫీట్ల వెడల్పుతో ఒక్కోవైపు 1.2 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్నారు. సర్వీసు రోడ్డుతోపాటు డ్రెయినేజీలు, లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయనున్నారు. సర్వీసు రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టు సంస్థ ఇటీవలే ప్రారంభించింది. సర్వీసు రోడ్డు నిర్మించాల్సిన ప్రాంతంలో హైవేకు ఇరువైపులా మల్లన్నగుట్ట వరకు రెండు వరుసలుగా ఉన్న చెట్లను కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పూర్తిగా తొలగించారు. గుంతలమయంగా ఉన్న మట్టి రోడ్డును ప్రొక్లెయిన్‌లతో చదును చేశారు. నిర్దేశించిన కాలపరిమితి కంటే ముందుగానే సర్వీసు రోడ్డు పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ, కాంట్రాక్టు సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈమేరకు పనులు వేగవంతం చేశారు. సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తయినట్లయితే ఇక్కడ రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడడంతోపాటు గ్రామస్తుల ఇబ్బందులు తొలగనున్నాయి.

త్వరితగతిన పూర్తి చేయాలి



మల్లన్నగుట్ట వద్ద ఉన్న జంక్షన్ వరకు సర్వీసు రోడ్డు లేకపోవడంతో గ్రామంలోకి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. సర్వీసు రోడ్లను గుట్ట వరకు నిర్మించాలని ఏళ్లుగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు విన్నవిస్తూ వచ్చాం. ఇప్పటికైనా సర్వీసు రోడ్లు మంజూరు కావడం పట్ల సంతోషంగా ఉంది. నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

-జాల వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఇనుపాముల

మునుగోడును మున్సిపాలిటీగా చేస్తా

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



ఉచిత ప్రయాణంపై బస్సులో మహిళలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడును అతి త్వరలో మున్సిపాలిటీగా మార్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడు మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలతోపాటు నూతన కార్యాలయాలకు అనువైన స్థలాలను కాలినడకన కలియదిరిగి పరిశీలించారు. అంతకుముందు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలను కలిసి ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉంది, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాతబడిన పోలీస్ స్టేషన్‌ను కూల్చివేయించి నూతన భవనాన్ని ఎంపీడీఓ కార్యాలయాల సముదాయంలో నిర్మించేందుకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అదేవిధంగా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హాస్టల్ భవనాలను మరోచోటుకు మార్చి వాటి స్థానంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌ను వెనుకభాగంలో నిర్మించి ప్రజలకు అనువుగా బస్టాండ్‌ని సిద్ధం చేస్తానన్నారు. డిగ్రీ, ఇంటర్, ఐటీఐ, ఇతర కళాశాలలను మంజూరు చేయించి పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న మునుగోడును ఆదర్శంగా తీర్చిదిద్ది అందరూ ఆనందపడేలా చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి, మాజీ సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న, జాల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, చెన్నారెడ్డి, జితేందర్ రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, భాస్కర్, జంగిలి నాగరాజు, జిట్టగోని యాదగిరి, అన్వర్, సైదులు, ఉదయ్ ఉన్నారు.

రూ.50 లక్షలతో దుర్గామాత ఆలయం నిర్మిస్తా

- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



అమ్మవారికి అభిషేకం చేస్తున్న భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని బ్రహ్మంగారి గుట్టపై రూ.50 లక్షలతో దుర్గామాత ఆలయ నిర్మాణం చేపడతానని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని పలు కాలనీల్లో దుర్గామాత విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెజవాడ దుర్గమ్మ మాదిరిగానే బ్రహ్మంగారి గుట్టపై నిర్మించే దుర్గామాత ఆలయంలో అమ్మవారు పూజలు అందుకుంటారని తెలిపారు. రూ.50 లక్షలకు ఎక్కువ అయినా వెచ్చించి ప్రతిష్టాత్మకంగా ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.కటికం సత్తయ్యగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, చీర పంకజ్‌యాదవ్, బోనగిరి దేవేందర్, మారగోని భవాని గణేశ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, గోపీనాథ్, మహేందర్ రెడ్డి, రాపోలు వెంకటేశ్వర్లు, వివేక్‌రెడ్డి పాల్గొన్నారు.

శివారు గ్రామాల్లో బెల్టు షాపుల దందా !

- మునుగోడులో దాదాపు 80 శాతం మూసివేత
- నియోజకవర్గ శివారు మండలాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

మునుగోడు: మునుగోడు నియోజకవర్గ శివారు గ్రామాల్లో బెల్టు దుకాణాల దందా మూడు పువ్వులు, ఆరు కాయల్లా కొనసాగుతోంది. మద్యానికి బానిసై అనేకమంది అనారోగ్యాలకు గురికావడంతోపాటు తగువులు పడుతున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా బెల్టు దుకాణం నిర్వహించకూడదని నిర్ణయిచారు. ఎమ్మెల్యే నిర్ణయాన్ని అమలు చేసేందుకు పోలీసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గ్రామాల్లోని బెల్టు దుకాణాలు దాదాపు 80 శాతం మూతపడ్డాయి. మరో 20 శాతం అది కూడా దొంగచాటుగా కొనసాగిస్తున్నారు.

బార్లను తలపిస్తున్న బెల్టు దుకాణాలు

మునుగోడులో బెల్టు దుకాణాలు లేకపోవడంతో నకిరేకల్, నల్లగొండ, దేవరకొండ, భువనగిరి తదితర నియోజకవర్గాల్లోని శివారు గ్రామాల్లో బెల్టు దుకాణాలు జోరుగా కొనసాగిస్తున్నారు. బార్లలో ఉండేలా వివిధ రకాల వంటలు వండి మద్యం విక్రయాలు కొనసాగుతున్నారు. దీంతో మునుగోడు నియోజకవర్గంలోని ప్రజలు అక్కడికి వెళ్లి మద్యం సేవిస్తున్నారు. ఈ విషయం తెలిసిన మునుగోడు పోలీసులు తమ పరిధి కాకపోవడంతో ఆ బెల్టు దుకాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేక పోతున్నారు. ఎక్సైజ్ అధికారుల పరిధిలో చిట్యాల మండలం తాళ్లవెల్లాంల గ్రామం ఉన్నా వారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో మునుగోడు నియోజకవర్గంలో బెల్టు దుకాణాలు మూసివేయించినా ప్రయోజనం లేకుండా పోతోందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునుగోడులో లాగానే ఇతర నియోజకవర్గాల్లో కూడా బెల్టు దుకాణాలను మూసివేయించాలని పలువురు మహిళలు, యువకులు కోరుతున్నారు.

లలితా త్రిపురసుందరీ దేవిగా దుర్గామాత



నల్లగొండ: పూజల్లో పాల్గొన్న భక్తులు



గట్టుప్పల్ మార్కెండేయ ఆలయం ఆవరణలో..



చిట్యాల : 108 చీరలతో శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా కనకదుర్గమ్మ



నల్లగొండ : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు



శాలిగౌరారం : మాచారంలో దుర్గామాత విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్

బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం



సభ్యత్వం అందజేస్తున్న గోలి మధుసూదన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని 19వ వార్డులో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కాని వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందిస్తోందన్నారు. వేల కోట్లు రూపాయలతో జాతీయ రహదారులు, గ్రామాలు, మున్సిపాలిటీ పట్టణాల అభివృద్ధికి ఖర్చు చేస్తోందన్నారు. కేంద్రం ఇచ్చే నిధులతోనే రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పగిడి మహేష్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్ రాథోడ్, దాసోజు భరత్, అన్నిమళ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం

నల్లగొండ టౌన్: మౌలిక సదుపాయాల కల్పనలో నీలగిరి మున్సిపల్ పాలకవర్గం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం, సీపీఎం నల్లగొండ పట్టణ కార్యదర్శి ఎండీ.సలీం ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని 43వ వార్డు సీపీఎం మహాసభలో వారు మాట్లాడారు. నల్లగొండలో 20వేల మందికి పైగా ఇళ్లు లేని పేదలు నివసిస్తున్నారని, వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు.

లండన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



లండన్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



వేడుకల్లో పాల్గొన్న వారితో ఎమ్మెల్యే వీరేశం

నల్లగొండ రూరల్, నకిరేకల్: లండన్‌లో తెలంగాణ ప్రాంత ప్రజలు బతుకమ్మ పండుగను శనివారం రాత్రి వైభవంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ పూలు పేర్చి వ్యవసాయ, సాంస్కృతిక జీవన నేపథ్యం కలిగిన పాటలతో అలరింపచేశారు. లండన్ పర్యటనలో ఉన్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలంగాణ ప్రాంత ప్రజలు చేసుకుంటున్న బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. గెలుపొందిన మహిళలకు ఎమ్మెల్యే వీరేశం చీరలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత అసోసియేషన్ చైర్మన్ సత్యకిల్లి, అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సట్టుపల్లి శ్రవణ్, కార్యదర్శి మద్దసాని సత్యప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.

'ఢిల్లీ పెద్దల జేబులు నింపేందుకే మూసీ ప్రక్షాళన'

నార్కట్‌పల్లి : ఢిల్లీ పెద్దల జేబులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన చేపడుతోందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. 2028 ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసేందుకు కాంగ్రెస్ నాయకులు మూసీ ప్రక్షాళన చేస్తున్నారని అన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల జీవితాలను సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అస్తవ్యస్తం చేస్తోందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో అభివృద్ధిపథంలో నడిచిన రాష్ట్రం.. రేవంత్‌రెడ్డి పాలనలో విధ్వంసంగా మారిందన్నారు. ఏ ప్రాజెక్టుకైనా డీపీఆర్ జీవనాడి అని, ఇంత పెద్ద మొత్తం బడ్జెట్‌తో చేపట్టబోతున్న మూసీ ప్రక్షాళనకు డీపీఆర్ ఎక్కడని ప్రశ్నించారు, డీపీఆర్ ఫైనల్ కాకుండా పేదల ఇళ్లు ఎందుకు కుల్చుతున్నారో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నకిరేకల్ : సమ్మేళనంలో పాల్గొన్న శివరంజని విద్యామందిర్ హైస్కూల్ 2002-03 విద్యా సంవత్సరానికి చెందిన ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



రామగిరి(నల్లగొండ): సమ్మేళనంలో పాల్గొన్న మమతా స్కూల్ 2007-08 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



నార్కట్‌పల్లి : ఎల్లారెడ్డిగూడెం హైస్కూల్‌లో సమ్మేళనంలో పాల్గొన్న 2008-09 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

బెల్టు షాపుల నిర్మూలనపై అవగాహన ర్యాలీ



చండూరు : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చండూరు : బెల్టు షాపులను నిర్మూలించాలని కోరుతూ మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోరిమి ఓంకారం, మాజీ సర్పంచ్‌లు సాపిడి రాములు, అబ్బనబోయిన లింగయ్య, నాయకులు ఇరిగి రాజు, బూతరాజు ఆంజనేయులు, బొమ్మరబోయిన సైదులు, కావలి ఆంజనేయులు పాల్గొన్నారు

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

మర్రిగూడ : గ్రామాల్లో అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కె.రంగారెడ్డి హెచ్చరించారు. ఆదివారం మర్రిగూడ మండలంలోని దామెరబీమనపల్లి గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి పలు బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఐతరాజు పాపయ్య అనే వ్యక్తి తన కిరాణ షాపులో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడన్న సమాచారంతో దాడి చేసి షాపులో అక్రమంగా నిల్వ ఉన్న 12 లీటర్ల ఐఎంఎఫ్‌ఎల్ మద్యం బాటిళ్లు పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన వెంట రవి, వాహీద్, రమేష్, సత్యనారాయణ, యాదగిరిలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ ధర్మా తెలిపిన వివరాల ప్రకారం ..చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామం నుంచి మాంగటి శ్రీనివాస్ హోండా యాక్టివా వాహనంపై జాతీయ రహదారి మీదుగా సీఆర్ పాలిమర్స్ పరిశ్రమకు వెళుతుండగా వెనక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా వైద్య చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్సకుగాను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ బంధువు సత్యనారాయణ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.